# పరిష్కారం

"కడుపు తీయించుకుంటున్నారంటగా అమ్మగారూ!" రంగి మాటలకి తలెత్తి చూసింది జమున.

అవునన్నట్లుగా తలవూపింది.

"ఎందుకమ్మా!"

"ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలు వద్దనుకున్నాం." నెమ్మదిగా జవాబు చెప్పింది.

రంగి ఆమె కాళ్ల దగ్గర కూలబడింది.

"మరి అట్టాటపుడు ముందే ఆపరేసన్ సేపించుకోవాల్సింది కదమ్మా!" దీర్ఘం తీసింది.

నిజమే. ఏమిటో యిన్ని తెలివితేటలుండీ యిలా అజాగ్రత్త అయిపోయింది. జమున నిట్టూర్చింది. రంగిమీదనుండి చూపులు మరల్చుకుని మళ్ళీ పుస్తకంలో తలదూర్చింది.

"..కానీ అమ్మా! బిడ్డనట్టా సంపడం పాపం కదమ్మా!" రెండు క్షణాలాగి రంగి మళ్ళీ మొదలుపెట్టింది. "ఈసారికి కనేసి, తర్వాత ఆపరేసన్ సేపించుకో." పనిమనిషే అయినా పెద్దవయసు తెచ్చిన అర్హతతో సలహా చెప్పింది.

జమున ఆశ్చర్యంగా చూసింది రంగి తీసుకుంటున్న చొరవకి.

అది గ్రహించినట్లూ రంగి తల త్రిప్పుకుంది.

అస్తమిస్తున్న సూర్యుడివెలుగులో తైలసంస్కారం లేని తెల్లటిజుట్టు మెరిసింది.

"మీకు ఆడపిల్లలంటే యిష్టమంటరు గదమ్మా! ముందు పుట్టినోళ్ళిద్దరూ మగపిల్లలే అయితిరి . ఈసారన్న ఆడపిల్ల పుడతదేమో!" సంజాయిషీగా చెప్పింది.

జమున నవ్వింది. పుస్తకం మూసి ప్రక్కన పెట్టి, "ఒకవేళ మళ్ళీ మగపిల్లాడే పుడితే!" అంది.

"ఆడపిల్లలయినా.. మగపిల్లలయినా యిద్దరికంటే ఎక్కువమంది వుండకూడదే ఈ రోజుల్లో. పెంచడమూ, పోషించడమూ కష్టం."

జమున మాటలకి రంగి బుగ్గలు నొక్కుకుంది. "పెంచేది కష్టమా! అదేంటమ్మగారూ! ఇంత ఆస్తి వుండాది. ఒక్క బిడ్డని పెంచేటిది కష్టమా!"

జమున మళ్ళీ నవ్వింది ఆ అమాయకత్వానికి.

"పెంచడం కష్టం అంటే మనకి కష్టమా! కాదా! అనికాదు. అందరూ యిలాగే అనుకుని పిల్లల్ని కనేశారనుకో. జనాభా విపరీతంగా పెరిగిపోతుంది. స్కూళ్ళలో, కాలేజీల్లో సీట్లు దొరకవు. చదువు పూర్తి చేసినా వుద్యోగాలు దొరకవు. దేశం అభివృద్ధి చెందదు. వెనుకబడిపోతుంది. కాబట్టి యిద్దరుపిల్లలతో సరిపెట్టుకోవడం దేశంలో ప్రతిఒక్కరి బాధ్యత." తనకి బాగా అలవాటయిన ఉపన్యాసాన్ని మామూలు మాటల్లో.. రంగికి అర్థమయే రీతిలో గడగడా చెప్పి వూపిరి తీసుకుంది జమున.

"అట్టనా! అయితే తమరు కడుపు తీపించుకునేది దేసంకోసమా!" గొప్ప విషయం అర్థమయినట్టుగా రంగి ఆవులిస్తుంటే, ఆ మాటల్లో ఏమన్నా వ్యంగ్యం వుందేమో అని జమున ఆమె మొహాన్ని తేరిపార చూసింది.

ముసలి రంగి మొహంలో అమాయకత తప్ప మరేమీ కనబడలేదు. "ఏమో! నేను మాత్రం పద్నాలుగు మందిని కన్నా." అంది.

మెల్లగా లేచి, వంగిపోయిన నడుముని సవరించుకుంటూ కదిలిపోయింది.

ఆ వ్యాఖ్యకి భావం ఏమిటో జమునకి బోధపడలేదు. కానీ ఏదో అనీజీనెస్ వళ్ళంతా పాకింది.

పొట్టమీద తడుముకుంటూ అనుకుంది "రేపు పదింటికి అపాయింట్‌మెంట్ డాక్టర్ లక్ష్మితో." అని.

*****

హాస్పిటల్ ముందు స్కూటర్ ఆగగానే జమున క్రిందికి దిగింది.

"మీరు వెళ్ళండి. ఫరవాలేదు." అంది రాఘవతో.

"కాసేపు వుంటాన్లే." స్కూటర్ ఒకప్రక్కగా ఆపి ఆమెతో పాటు లోపలికి నడుస్తూ జవాబు చెప్పాడు రాఘవ.

లోపలికి వెళ్ళి కూర్చున్నారు యిద్దరూ.

కొంచెం దూరంలో కూర్చుని వున్న మరో జంటని చూడగానే జమున వులిక్కిపడింది.

"చూడండి. అతనిగురించే నేను చెప్పింది." అంది.

"ఎవరు!" అన్నాడు రాఘవ.

" భాస్కర్ అని చెప్పలేదూ! ఎల్.ఐ.సి.లో పని చేస్తాడు. ఆడపిల్ల అని తెల్సుకుని వాళ్ళ ఆవిడకి అబార్షన్ చేయిస్తున్నాడు."

రాఘవకి గుర్తొచ్చింది. "ఓహో! మీ మహిళాసమితి వాళ్ళు ఆఫీస్‌కి వెళ్ళి గొడవ చేశారు కదూ!" అన్నాడు.

"ఊఁ. ఆవిడకి అస్సలు యిష్టం లేదు ఫస్ట్‌టైం అబార్షన్ చేయించుకోవడం. బలవంతంగా చేయిస్తున్నాడు. మా సమితి కార్యకర్తలం ఒక యాభైమందిమి వెళ్ళి అతని ఆఫీస్ దగ్గర ధర్నా చేశాం. అయినా మళ్ళీ వచ్చాడు చూడండి."

అటువైపుగా వచ్చిన నర్స్‌ని దగ్గరకి పిల్చింది జమున. భాస్కర్ వైపు చూపించి "వాళ్ళు ఎందుకు వచ్చారు!" అంది.

"మీలాగానే. అబార్షన్‌కి." నర్స్ నవ్వుతూ చెప్పి వెళ్ళింది.

జమున మొహం చిట్లించింది. "మాలాగా ఏమిటి! మాలాగా కాదు వాళ్ళు." అనుకుంది.

భాస్కర్ భార్య కళ్ళల్లో నీళ్ళు, మొహంలో దిగులూ జమునకి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఎంత ఘోరం! ఇలా ఎన్నిసార్లు చేయిస్తాడు అబార్షన్! ఆడపిల్ల అని తెల్సిన ప్రతిసారీ అబార్షన్ చేయిస్తే ఆవిడ ఆరోగ్యం ఏమవుతుంది! ఇంకా పుట్టని పిల్ల మీదా, వ్యక్తిత్వమున్న తల్లిమీదా కూడా ఎంత భయంకరమయిన దౌర్జన్యం! తామందరూ యిలా చేతులు ముడుచుకుని కూర్చోవలసిందేనా!" జమునకి ఏడుపు వచ్చింది.

"ఇన్ని మహిళాసంస్థలూ.. యిన్ని ఉద్యమాలూ.. ఎందుకివన్నీ!"

డాక్టర్ వచ్చి భాస్కర్‌తో మాట్లాడుతోంది. జమున లేచి వడివడిగా వాళ్ళ దగ్గరికి వెళ్ళింది. "డాక్టర్! ఆడపిల్ల అన్న కారణంతో అబార్షన్ చేయించడం చాలా ఘోరం. మీరెలా ఒప్పుకున్నారు యిలా బలవంతంగా అబార్షన్ చేయడానికి!"

డాక్టర్ సమాధానం చెప్పబోయేలోపు భాస్కర్ రెండు చేతులూ ఎత్తి దండం పెట్టాడు. "మేడమ్! ఇందులో మీరు కల్పించుకోవాల్సింది ఏమీ లేదు. మీరు మా ఆఫీస్‌కి వచ్చి చేసిన గొడవ చాలు. వెళ్ళండి. సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకోకండి." అన్నాడు.

"వెళ్ళను." జమున ఆవేశంగా అరిచింది. "భార్య కదా అని మీరు దౌర్జన్యం చేస్తే మేము చూస్తూ ఊరుకుంటాం అనుకోకండి."

"దౌర్జన్యమా!" భాస్కర్ ఆశ్చర్యంగా చూశాడు. "ఇందులో దౌర్జన్యమేమీ లేదు. ఆవిడకి యిష్టమే."

"అబద్ధం.." జమున మాట పూర్తి కాకముందే ఆమె నోరు విప్పింది.

"లేదండీ! నిజమే. నాకిష్టమే. మేమిద్దరం కలిసే ఈ నిర్ణయం తీసుకున్నాం" అంది.

"అరే..." జమున దిగ్భ్రమగా చూసింది. "ఎందుకు భయపడుతున్నారు మీరు! నిజం చెప్పండి." అంది.

"భయమేమీలేదు." ఆమె స్పష్టంగా చెప్పింది. "నాకు కొంచెం బాధగా వున్న మాట నిజమే. కానీ మాకుటుంబం ఆర్థిక పరిస్థితిని బట్టి ఇదే సరైన నిర్ణయం అని మేమనుకున్నాం"

"అంటే కేవలం పోషించలేరు కాబట్టేగా!"

"అవును." భాస్కర్ గొంతు విప్పాడు. "ఆడపిల్లని పెంచడం.. పెళ్ళి చేయడం.. నా వల్ల కాదు. నాకు నలుగురు చెల్లెళ్ళు. వాళ్ళ సంగతి చూశాను. చాలు. ఇంక కూతురు పుడితే పెంచే ఓపిక నాకు లేదు."

జమున చిరాకుగా ఏదో అనబోయింది. కానీ భాస్కర్ వినిపించుకోలేదు. "ఏం చూసుకుని కనాలండీ ఆడపిల్లని! నాకూ బాధగానే వుంది అబార్షన్ చేయించడం. అయితే ఏం చేయమంటారు! ఇన్ని మాటలు చెప్తారు మీ మహిళాసంఘాల వాళ్ళు. వరకట్న సమస్య రూపుమాపారా! ఆడపిల్లలకి రక్షణ యివ్వగలుగుతున్నారా!" అన్నాడు.

అతని మూర్ఖపు వాదనకి జమునకి కోపం వచ్చింది. కానీ ఎలాగో కంట్రోల్ చేసుకుని మృదువుగా చెప్పింది. "చూడండి భాస్కర్ గారూ! అవన్నీ మహిళలు ఒక్కళ్ళూ రూపుమాపగల సమస్యలు కావు. పోనీ అలాగే అనుకున్నా అసలు మహిళలు అంటూ ఉండాలి కదా రూపుమాపడానికి. పుట్టకుండానే చనిపోతే ఎలా! పుట్టాలి, పెరగాలి, మంచి వ్యక్తిత్వాన్ని సంపాదించుకోవాలి. ఇలాంటి సమస్యలకి ఎదురీది నిలబడగలగాలి."

"ఏమక్కర్లేదులెండి. ఇపుడు ఆడపిల్ల పుట్టి సమస్యలకి ఎదురీది మమ్మల్ని ఉద్ధరించేదేమీ లేదు." భాస్కర్ కట్ చేసినట్లుగా అన్నాడు.

"అర్థం లేకుండా మాట్లాడకండి." జమునకి మళ్ళీ ఆవేశం వచ్చింది. "నేను ఇప్పుడే మావాళ్ళని పిలిపిస్తాను. మీరు ఏ హాస్పిటల్‌లోనూ ఏ డాక్టర్ చేతా ఈ పని చేయించలేరు. ఎలా ఆపాలో, ఏం చేయాలో నాకు తెలుసు."

"ఏమిటి మీరు చేసేది!" భాస్కర్ పెద్దగా అరిచాడు. "ఆఫీస్‌లో గొడవ చేసి నా పరువు తీశారు. ఇపుడు హాస్పిటల్‌కి కూడా వచ్చారు. ఇంత అల్లరి చేసే హక్కు మీకు లేదసలు. మీరు ఇంకా ఇలాగే బిహేవ్ చేస్తే నేనే పోలీస్ కంప్లయింట్ యిస్తానసలు ముందు. అసలు మా వెనకాల యిక్కడిదాకా ఎవరు రమ్మన్నారు మిమ్మల్ని!"

"ఊరుకోండి భాస్కర్" డాక్టర్ లక్ష్మి నచ్చచెప్తున్నట్లుగా అంది. "ఆవిడ మీకోసం రాలేదు. వాళ్ల పని మీద వాళ్ళు వచ్చారు. మీరు పదండి. ఇక యిక్కడ గొడవేం వద్దు."

"వాళ్ళ పనేమిటి!" భాస్కర్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆమె కూడా అబార్షన్ కోసమే వచ్చింది." అంతవరకూ చోద్యం చూస్తున్న నర్స్ వ్యాఖ్యానించింది.

"ఓహో!" అన్నాడు భాస్కర్ చాలా వ్యంగ్యంగా, కొంచెం ఆశ్చర్యంగా. "ఆడపిల్ల అనేనా!"

"కాదు." రోషంగా చెప్పింది జమున. "ఆడపిల్లో, మగపిల్లాడో మేమసలు తెలుసుకోలేదు. మాకు యిద్దరు పిల్లలున్నారు. మూడోవాళ్ళు వద్దనుకున్నాం."

"అయ్యో! ఎందుకని! భ్రూణహత్య పాపం అంటారుగా!" భాస్కర్ గొంతులో ఈసారి స్పష్టమయిన వ్యంగ్యం.

"అవును. అంటాను. కానీ పెరిగే జనాభా దేశానికి కలిగించే విపత్తు తెలుసు కాబట్టి చేయించుకుంటున్నాను."

"శభాష్" భాస్కర్ చప్పట్లు చరిచాడు.

"దేశశ్రేయస్సు కోసం అబార్షన్ చేయించుకుంటున్న మీరు ఆదర్శ దంపతులు అయితే, కుటుంబ శ్రేయస్సు కోసం మొదటి బిడ్డని చంపుకుంటున్న మేము దుర్మార్గులమా! జనాభా సమస్యకి పరిష్కారం లేదు కాబట్టి మీరు అబార్షన్ చేయించుకుంటున్నారు. వరకట్న సమస్యకీ.. ఆడపిల్లల మీద అత్యాచారాలకీ పరిష్కారం లేదు కాబట్టి నాభార్య అబార్షన్ చేయించుకుంటోంది. రెంటికీ పెద్ద తేడా లేదు. ఉందా చెప్పండి!"

భాస్కర్ గద్దింపుకి ఆమె ఉలిక్కిపడింది.

"భ్రూణహత్య పాపం. .. అనేమాటకి వస్తే మీరు చేసేదీ పాపమే. లేదు, ఆ పాపం చేయడానికి మీకో కారణం వుందంటే, మాకూ మరో కారణం వుంది." అతను పరుషంగా చెప్పిన మాటలకి జమున నివ్వెరపోయింది.

ఒక్కక్షణం ఆమెకి ఏం మాట్లాడాలో తోచలేదు. డాక్టర్‌తో కలిసి వాళ్ళిద్దరూ లోపలికి నడిచారు. వెళ్ళి ఆపాలని జమున మనసు ఆరాటపడింది. కానీ శరీరం సహకరించలేదు. భాస్కర్ వాదనకి ఆమె గొంతులో సమాధానం లేదు. ఆ వాదన సరైనది కాదని ఆమె మనసుకు తెలుస్తోంది. కానీ సమాధానం మాత్రం దొరకడం లేదు.

"తమ కారణం, వాళ్ల కారణం ఒకే స్థాయిలోవా! జనాభా సమస్య సామాజికమయినది. అది ఎవరో సృష్టించినది కాదు. కేవలం కంట్రోల్ చేయవలసినది.

కానీ వరకట్నం. . స్త్రీకి రక్షణ లేకపోవడం. . మనుషులు సృష్టించిన సమస్యలు. వాటికి కూడా అబార్షనే పరిష్కారమా!

అది కాకుండా మనుషులింకేమీ చేయలేరా! పిల్లల్ని చంపుకోవడం తప్ప ఆ సమస్యలకి పరిష్కారం లేదా!

మనుషులు సృష్టించుకున్న ఆ సమస్యల్ని మరోవిధంగా మనుషులు రూపుమాపుకోలేరా!"

జమునకి కళ్ళు తిరిగినట్లయింది.

"మనుషులు ఎంత ఘోరమయిన సమస్యలు సృష్టించుకోగలరు!

వాటికి మరింకెంత ఘోరమయిన పరిష్కారాలు కనిపెట్టగలరు!

ఎలాంటి వాదనలతో తమ చర్యల్ని సమర్థించుకోగలరు!"

నీరసంతో నేల మీదికి వాలిపోతున్న జమున మనస్సులో ప్రశ్నల హెూరు ఉవ్వెత్తున లేచింది.

*****